

చీనీ టన్ను రూ.21 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21,000 పలికాయి. మార్కెట్టుకు 20 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.14

అనంతపురం కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.14 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

33.2°/ 18.8°

జిల్లాలో చలి కాస్త తగ్గింది. అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

క్లుప్తంగా

జిల్లాకు వర్ష సూచన

బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న 5 రోజుల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 31.6, రాత్రి ఉష్ణోగ్రతలు 22.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కావచ్చని పేర్కొన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 75–88, మధ్యాహ్నం 30–55 మధ్య నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

మత్తుతో భవిష్యత్తు నాశనం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: 'యువత మత్తు, మాదక ద్రవ్యాలకు బానిసకాకుండా చూడాలి. వాటిని సేవించడం ద్వారా కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలి. జిల్లాలో మత్తు, మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలు అరికట్టడమే లక్ష్యంగా పనిచేయాలి.' అని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నార్కో కో–ఆర్డినేషన్ కమిటీ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుకు బానిసలైతే వారి భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. మత్తు, మాదకద్రవ్యాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బస్టాండులు, రైల్వే స్టేషన్లు, జనసంచారం ఉండే కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. ఔషధ దుకాణాల్లో వైద్యుని ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మాత్రలు ఇవ్వకుండా చూడాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు గంజాయి, తదితర మాదక ద్రవ్యాలు రవాణా కాకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. డీఆర్‌ఓ ఎ.మలోల, అదనపు ఎస్పీ రమణమూర్తి, ఆర్డీఓ కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.



దార్శనిక నేత.. విద్యా ప్రదాత

- వైఎస్సార్‌సీపీ పాలనలో విద్యారంగం కొత్త పుంతలు
- ప్రతి ఏటా వైఎస్ జగన్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ
- నేటికీ గుర్తుచేసుకుంటున్న తల్లిదండ్రులు, విద్యార్థులు
- మనబడి నాడు–నేడుతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు
- అమ్మఒడి, ఫీజురీయింబర్స్‌మెంట్, ఇంగ్లిష్ పాఠాలతో చదువుకు ఊతం
- కూటమి ప్రభుత్వంలో నిర్వీర్యమైన విద్యావ్యవస్థ
- ప్రకటనలకే పరిమితమైన తల్లికి వందనం, ఫీజురీయింబర్స్‌మెంట్

వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో విద్యా రంగం కొత్త పుంతలు తొక్కింది. అమ్మఒడి, ఫీజురీయింబర్స్‌మెంట్, నాడు–నేడు, డిజిటల్, ఆంగ్ల బోధన, విదేశీ విద్య ఇలా ఎన్నో కార్యక్రమాలతో నవశకానికి నాంది పలికారు. చదువుతోనే సమాజ మార్పు సాధ్యమని బలంగా నమ్మిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగానే ప్రతి అడుగు వేశారు. ఏటా తన పుట్టిన రోజు సందర్భంగా 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్ ఉన్న ట్యాబ్‌లను పంపిణీ చేసి చదువులకు బాసటగా నిలిచారు. నేడు జగన్ జన్మదినం సందర్భంగా నాడు లబ్ధిపొందిన కుటుంబాలన్నీ మరోసారి ఆయన్ను గుర్తు చేసుకుంటున్నాయి.

– అనంతపురం ఎడ్యుకేషన్



నాడు–నేడు కింద రూ.391 కోట్ల ఖర్చు

ఆధునిక విద్యాబోధనలో భాగంగా గత ప్రభుత్వంలో మనబడి నాడు–నేడు కింద తొలివిడతలో జిల్లాలోని 698 స్కూళ్లలో రూ. 201 కోట్లు ఖర్చు చేసి మౌలిక వసతులు కల్పించారు. రెండోవిడతలో 1,079 స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు రూ. 384.67 కోట్లు కేటాయించి రూ.190 కోట్ల దాకా ఖర్చు చేశారు.

స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ప్యానెళ్లు

వైఎస్ జగన్ హయాంలో తొలిదశలో 469 స్కూళ్లకు 1595 ఇంటరాక్టివ్ ప్యానెళ్లు, రెండోదశలో 1579 స్కూళ్లకు 3,174 ప్యానళ్లు అందించారు. అలాగే 1089 స్కూళ్లకు 1748 స్మార్ట్ టీవీలను ఇచ్చారు.

'కూటమి' వచ్చిన తర్వాత నిర్వీర్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేలా అడుగులు వేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. నాడు–నేడు రెండోవిడత కింద జిల్లాలో 1,079 స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు ఎంపికయ్యాయి. రూ. 384.67 కోట్లు కేటాయించారు. ఇందులో రూ. 190 కోట్లకు పైగా ఖర్చు చేశారు. చాలా స్కూళ్లలో 10 శాతం మాత్రమే పనులు పెండింగ్ ఉన్నాయి. అయితే ప్రభుత్వం మారిన తర్వాత ఈ నిధులు విడుదల చేయలేదు. వివిధ వస్తువులను సరఫరా చేస్తున్న ఏజెన్సీని నిలుపుదల చేశారు. స్మార్ట్ టీవీలు,ఐఎఫ్‌పీలు మరిన్ని రావాల్సి ఉన్నా ఆగిపోయాయి. పాఠశాలల్లో విద్యార్థుల వద్ద ట్యాబ్‌లు కనిపించడం లేదు. ప్రతి విద్యార్థికీ 'తల్లికి వందనం' పేరుతో ఏటా రూ. 15 వేల చొప్పున ఇస్తామని చెప్పిన కూటమి నేతలు విద్యా సంవత్సరం ప్రారంభమై ఆర్నెళ్లవుతున్నా నేటికీ అమలు చేయలేదు.



జగన్ హయాంలో మెరుగులు దిద్దుకున్న అనంతపురం రూరల్ మండలం కేకే కాలనీ యూపీ పాఠశాల తరగతి గది

విద్యార్థులకు ట్యాబ్స్ సరఫరా వివరాలు

స్కూళ్లు	2022-23
499	21,776

2023-24	మొత్తం
21,150	42,926

ఇదీ జగనన్న బ్రాండ్ గవర్నెన్స్

- జగనన్న గోరుముద్ద ద్వారా వారంలో ఆరురోజులు 16 రకాల పదార్థాలతో మధ్యాహ్న భోజనం అందించారు.
- నాడు–నేడులో స్కూళ్లలోని టాయిలెట్ మొదలు కాంపౌండ్ వరకూ 11 రకాల వసతులు కల్పించారు.
- అమ్మఒడితో ఏటా విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.15 వేలు జమ చేశారు.
- ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు ఏటా జగనన్న పుట్టినరోజు సందర్భంగా ట్యాబ్‌ల పంపిణీ చేపట్టారు.
- స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ)ల ద్వారా బోధన చేశారు.
- ఫీజురీయింబర్స్‌మెంట్‌తో విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించారు.
- విద్యా, వసతిదీవెన అమలు చేశారు.

జగన్ హయాంలో జిల్లాలో అమ్మఒడి లబ్ధి ఇలా...

విద్యా సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	మొత్తం (రూ.కోట్లు)
2019-20	3,62,579	543.87
2020-21	3,81,559	572.34
2021-22	2,16,842	325.26
2022-23	2,13,394	272.41

పెండింగ్‌లో ఫీజురీయింబర్స్‌మెంట్

జిల్లాలో దాదాపు 42 వేలమందికి పైగా డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ తదితర కోర్సులు చేస్తున్న విద్యార్థులకు రూ. 90.10 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలున్నాయి. గత ప్రభుత్వంలో ప్రతి మూణ్నెల్లకోసారి విద్యాదీవెన కింద ఫీజురీయింబర్స్‌మెంట్ డబ్బులు తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఇప్పుడు అతీగతీలేదు.

స్కూళ్ల రూపురేఖలు మారాయి



గత ప్రభుత్వంలో 'మనబడి నాడు–నేడు' కింద కోట్లాది రూపాయలు ఖర్చు చేసి వసతులు కల్పించడంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. మొన్న జరిగిన మెగా పేరెంట్స్ సమావేశాలన్నీ గత ప్రభుత్వం నిర్మించిన గదులు, సమకూర్చిన ఫర్నిచర్‌లోనే జరిగాయి. స్మార్ట్ టీవీ, ఐఎఫ్‌పీల్లోనూ కార్యక్రమాలను తిలకించారు. వీటి ద్వారానే బోధన జరుగుతోంది. ఇంగ్లిష్ మీడియం తీసేస్తామంటే తల్లిదండ్రులు ఒప్పుకునే పరిస్థితి లేదు.

– రమణారెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం

బోధనలో సమూల మార్పులు



పోటీతత్వాన్ని దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలల్లో బోధన పద్ధతుల్లో సమూల మార్పులు వచ్చాయి. బ్లాక్ బోర్డులు, ఫర్నిచర్, డిజిటల్ టీచింగ్ అమలు చేశారు. ఇంగ్లిష్ మీడియం తీసుకొచ్చారు. అమ్మఒడి పథకం అమలు చేయడంతో విద్యార్థుల హాజరు శాతం బాగా పెరిగింది. మధ్యాహ్న భోజనం చాలా రుచికరంగా, పౌష్టికంగా ఉండేది. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి పూర్తి అధ్వానంగా ఉంది.

– నరసింహారెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం

తల్లికి వందనం ఎప్పుడిస్తారో?



నా భర్త చిన్న ఉద్యోగి, నేను దినసరి కూలి. మాకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. జగన్ ప్రభుత్వంలో ఏటా రూ.15 వేలు అమ్మఒడి వచ్చింది. ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15 వేల చొప్పున కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ఇస్తామని చెప్పినా ఇంత వరకూ ఇవ్వలేదు. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం మాది. ఫీజులు కట్టేందుకు ఇబ్బంది పడుతున్నాం.

– ఎం ధనలక్ష్మి, పామిడి

క్లుప్తంగా

తిరుమల టికెట్ల అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

• ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి డిమాండ్



ఉరవకొండ: తన సిఫారసు లేఖను ఉపయోగించి కొందరు దళారులు పవిత్ర తిరుమలలో దర్శన టికెట్లను భక్తులకు విక్రయిస్తున్నట్లుగా ఈ–టీవీలో ప్రసారమైన అంశాన్ని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఖండించారు. భగవంతుడి దర్శనానికి ఇచ్చే సిఫారసు లేఖలు అమ్ముకునే హీనస్థితిలో తాను లేనన్నారు. సుపథకం టికెట్ల అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలంటూ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలో కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారి దర్శనానికి వెళ్లడానికి వీఐపీ బ్రేక్‌తో పాటు సుపథం టికెట్ల కోసం సిఫారసు లేఖలు తీసుకెళుతుంటారన్నారు. ఈ లేఖను ఇవ్వడం దేవుడికి చేస్తున్న సేవలా తాము భావిస్తున్నామన్నారు. వీటిని ఎలాంటి పరిస్థితుల్లోనూ దుర్వినియోగం చేయడం లేదన్నారు. ప్రసారమైన అవాస్తవాలపై తాను స్పందించి, తన లేఖలతో ప్రలోభాలకు గురి చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరానన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : ఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

గార్లదిన్నె: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. శుక్రవారం ఉదయం గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కేసుల దర్యాప్తులో జాప్యం చోటు చేసుకోకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలో నేరాల శాతాన్ని తగ్గించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రాత్రి సమయంలో గస్తీ నిర్వహించి, చోరీలు జరుగకుండా అడ్డుకట్ట వేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం!

• ఈ–క్రాప్ ఆధారంగా ధాన్యం కొనుగోలు
• కేంద్రాల్లో దళారుల ఇష్టారాజ్యం!
• రైతు ముసుగులో పచ్చ మూక దోపిడీ
• క్వింటాపై రూ.380 నుంచి రూ.400కు పైగా స్వాహా

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అంతా మా ఇష్టం అనే ధోరణితో టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను కాదని తాము నిర్ణయించుకున్న ధరతోనే రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అక్రమాలకు తెరలేపారు. టీడీపీ నేతల స్వార్థానికి అమాయక రైతులు బలవుతున్నారు.



ధాన్యం కొనుగోలు చేస్తున్న దృశ్యం



బొమ్మనహాళ్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వసంతబాబు (ఫైల్)

రాయదుర్గం/బొమ్మనహాళ్/కణేకల్లు: హెచ్చెల్సీ ఆయకట్టు పరిధిలో ధాన్యాగారంగా పేరుగాంచిన కణేకల్లు, బొమ్మనహాళ్, డి హీరేహాళ్ ప్రాంతాల్లో టీడీపీ నేతల అండ చూసుకుని దళారులు రెచ్చిపోతున్నారు. తమ కళ్ల ముందే జరుగుతున్న మోసాలను రైతులు పసిగట్టినా... టీడీపీ నేతల దౌర్జన్యాలకు భయపడి నోరు మెదపలేకపోతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో హెచ్చెల్సీ ఆయకట్టుతో పాటు బోరుబావుల కింద 10,492 హెక్టార్లలో వరి పంట సాగులోకి వచ్చింది. చీడపీడలు, వాతావరణంలో చోటుచేసుకున్న అనేక మార్పులతో వరినాట్లు మొదలు పంట దిగుబడి వరకూ రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం పేరుతో అందిస్తానన్న రూ.20 వేల ఆర్థిక సాయం అందకపోయినా పెట్టుబడుల భారాన్ని సంతోషంగానే భరించారు. ఈ క్రమంలో కొన్నిచోట్ల మినహా మిగిలిన చోట్ల దిగుబడులు ఆశాజనకంగానే వచ్చాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే మేలు

గతంలో ధాన్యం విక్రయించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దళారులు, మిల్లర్లు రంగ ప్రవేశం చేసి అందిన కాడికి రైతులను దోచుకునేవారు. ఈ పరిస్థితి నుంచి అన్నదాతలను ఆదుకునేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పటిష్ట చర్యలు తీసుకున్నారు. రైతులు ఎక్కడేగాని ఇబ్బంది పడకుండా, దళారుల ప్రమేయం లేకుండా కళ్లాల వద్దకే అధికారులు వెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తూ వచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి డబ్బును రైతుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా బదలాయిస్తూ వచ్చింది. ఇదే విషయాన్ని ప్రస్తుతం రైతులు గుర్తు చేసుకుంటూ గత వైఎస్సార్‌సీపీ హయాంలోనే మేలు అని వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం.

మాటల్లోనే ధాన్యం కొనుగోలు

ఖరీఫ్ సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలుకు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో తొలి దశలో కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ వచ్చింది. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రైవేట్ మార్కెట్‌కు వరి ధాన్యం తరలించి తక్కువ ధరకే విక్రయించి నష్టపోయారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీతో పాటు విపక్షాల ఒత్తిళ్లకు దిగివచ్చిన ప్రభుత్వం కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం మాటల్లో మాత్రం కొంటున్నామని చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి ఎక్కడేగాని కనిపించడం లేదు. స్థానిక టీడీపీ నేతల కనుసన్నల్లోనే లావాదేవీలు సాగుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధర కాకుండా సొంతంగా వారు తక్కువ ధర నిర్ణయించి దళారులకు పంట కట్టబెడుతున్నారు.

ఈ–క్రాప్ ఆధారంగా కొనుగోలు

ఈ–క్రాప్ ఆధారంగా ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోళ్లు చేపట్టింది. ధాన్యం నాణ్యత బట్టి క్వింటాకు రూ.2,300 నుంచి రూ.2,320 మద్దతు ధర ప్రకటించింది. అయితే దళారులతో కుమ్మక్కైన స్థానిక టీడీపీ నేతలు ఇప్పటికే రైతులకు మాయమాటలు చెప్పి కింటా వరి ధాన్యాన్ని రూ.1,850 నుంచి రూ.1,900 చొప్పున కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. అనంతరం వీటిని రైతు ముసుగులో కొనుగోలు కేంద్రాలకు తరలించి క్వింటాపై రూ.380 నుంచి రూ.400కు పైగా ఆదాయం గడిస్తున్నారు. బొమ్మనహాళ్ మండలంలో స్థానిక టీడీపీ నేతల అండతో ఓ దళారీ 80 నుంచి 100 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేసి, రైతు ముసుగులో ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం.

ధాన్యం కొనుగోలులో పారదర్శకత

ధాన్యం కొనుగోలులో పారదర్శకత పాటిస్తున్నాం. దళారులు తీసుకొచ్చే ధాన్యంలో ఒక్క గింజ కూడా కొనే పరిస్థితి ఉండదు. ఈ–క్రాప్ ప్రామాణికంగా ధాన్యం ఇప్పటి వరకూ 116 మంది రైతులకు సంబంధించి 1,435 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. వీటికి సంబంధించి రూ.3.33 కోట్లు చెల్లించాల్సి ఉండగా, వంద మంది రైతుల ఖాతాల్లో రూ.2.89 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. మిగిలిన 16 మంది రైతుల ఖాతాల్లోకి ఒకట్రెండు రోజుల్లో డబ్బు జమ కానుంది. కొనుగోలు కేంద్రాల్లో ఏ చిన్న పొరపాటు జరిగిన కఠిన చర్యలు చేపడతాం.

– రమేష్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్

30 ఏళ్లుగా పనిచేస్తున్నా పట్టించుకోవడం లేదు

• ఫీల్డు అసిస్టెంట్ పోస్టులు కూడా అమ్ముకున్నారు
• ఎమ్మెల్యే శ్రావణి ఇంటి వద్ద టీడీపీ నాయకుడి ధర్నా



కుటుంబ సభ్యులతో కలసి ధర్నా చేస్తున్న ప్రసాద్

గార్లదిన్నె: పార్టీ కోసం తమ కుటుంబం 30 ఏళ్లుగా కష్టపడి పనిచేస్తున్నప్పటికీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పట్టించుకోవడం లేదని గార్లదిన్నె మండలం కనంపల్లికి చెందిన టీడీపీ నాయకుడు ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలసి అనంతపురం నగరంలోని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి ఇంటి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కోసం ఎంతో సేవ చేసిన తనకు కనీసం ఫీల్డు అసిస్టెంట్ పోస్టు కూడా ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్యే తల్లి ఒక్కో ఫీల్డు అసిస్టెంట్ పోస్టు రూ.5 లక్షలకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామనే ఉద్దేశంతో తనపై, కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధిష్టానం స్పందించి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని కోరారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి



అగ్రిగోల్డ్ భూములను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

పుట్లూరు: ఎన్నికలకు ముందు అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని కూటమి పెద్దలు ఇచ్చిన హామీని ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత నెరవేర్చడంలో విఫలమయ్యారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం ఆయన పుట్లూరు మండలం చెర్లోపల్లి వద్ద ఉన్న 217 ఎకరాల అగ్రిగోల్డ్ భూములను పరిశీలించారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అనుచిత ప్రవర్తన

గుత్తి: రైలు ప్రయాణికురాలిపై ఓ కానిస్టేబుల్ అనుచితంగా ప్రవర్తించాడు. వివరాలు... విజయవాడ దుర్గమ్మ ఉత్సవాలకు సంబంధించి బందోబస్తు నిర్వహణకు జిల్లాకు చెందిన పలువురు కానిస్టేబుళ్లు గురువారం రాత్రి ధర్మవరం నుంచి మచిలీపట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు(17216)లో బయలుదేరారు. రిజర్వేషన్ కోచ్‌లో ప్రయాణిస్తున్న వీరిలో గుత్తి పీఎస్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ అదే కోచ్‌లో ప్రయాణిస్తున్న యువతి పట్ల అనుచితంగా ప్రవరిస్తూ తన కోరిక తీర్చాలని బెదిరింపులకు దిగాడు. విషయాన్ని గమనించిన తోటి ప్రయాణికులు వెంటనే ఆగ్రహం వ్యక్తం చేస్తూ దేహశుద్ధి చేయడానికి సిద్ధం కావడంతో టాయిలెట్‌లోకి దూరి తలుపు వేసుకున్నాడు. అప్పటికే ఆగ్రహంతో ఊగిపోతున్న ప్రయాణికులు టాయిలెట్ తలుపు బద్ధలు కొట్టేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో అక్కడున్న వయో వృద్ధులు కల్పించుకుని వారించడంతో ప్రయాణికులు శాంతించారు. కాగా పరువు పోతుందని భావించిన బాధితురాలు... కానిస్టేబుల్ దుశ్చర్యపై ఫిర్యాదు చేసేందుకు వెనుకంజ వేసినట్లు తెలిసింది.

హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేయాల్సిందే

• రైతుల ప్రయోజనాలకు సమాధి కడితే సహించం
• సీఎం నిర్ణయంపై జలసాధన సమితి నాయకుల మండిపాటు
• కాలువ వెడల్పు చేయకనే లైనింగ్ పనులు చేపట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

అనంతపురం సెంట్రల్: హంద్రీ-నీవా ప్రాజెక్టు ప్రయోజనాలకు సమాధి కట్టే కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని జల సాధన సమితి నాయకులు మండిపడ్డారు. హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేయకుండానే లైనింగ్ పనులు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం జీఓ జారీ చేయడాన్ని ఖండిస్తూ జలసాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం హెచ్‌ఎన్ఎస్ఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, పలు రైతు సంఘాల నాయకులు, జలసాధన సమితి నాయకులు పాల్గొని మాట్లాడారు. హంద్రీ-నీవా కాలువ పనులు వెడల్పు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. 6.02 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ఈ ప్రాజెక్టు రూపకల్పన జరిగిందన్నారు. ఇది సాధ్యం కావాలంటే శ్రీశైలం సమీపంలోని మల్యాల నుంచి బెళుగుప్ప మండలం జీడిపల్లి వరకూ మొదటి దశ హంద్రీ-నీవా కాలవను 10వేల క్యూసెక్కులకు, జీడిపల్లి నుంచి దిగువకు 6 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండేలా కాలువ వెడుల్పు చేయాల్సిన అవసరముందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం హంద్రీ-నీవాను 3,850 క్యూసెక్కుల నుంచి 6,300 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యం ఉండేలా వెడల్పు చేసి లైనింగ్ పనులు చేపడుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇందుకు సంబంధించి 2021లో రూ.6,182 కోట్లతో పనులకు పరిపాలన అనుమతులు కూడా ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం చంద్రబాబు మాత్రం హంద్రీ-నీవా ప్రాజెక్టు లక్ష్యానికి తూట్లు పొడిచేలా 304, 305 జీఓలను జారీ చేసి కాలువ వెడల్పు పనులకు శాశ్వతంగా గండి కొట్టారని మండిపడ్డారు. వెంటనే ఈ జీఓలను రద్దు చేసి, హంద్రీ-నీవా కాలవను వెడల్పు చేయడంతో పాటు డిస్ట్రిబ్యూటరీలను నిర్మించి జిల్లాలోని 3.45 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎన్ఎస్ఎస్ సీఈ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జల సాధన సమితి కార్యదర్శి గంగిరెడ్డి, అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమోక్రటిక్ రైట్స్ (ఏపీడీఆర్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, మానవ హక్కుల వేదిక ప్రతినిధి ఎస్ఎం బాషా, రచయిత శాంతినారాయణ, రైతు సంఘం నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఐ నేత మల్లికార్జున, భారత రైతు సంక్షేమ సంఘం నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, విద్యావంతుల వేదిక నాయకులు వెంకటేష్, సురేష్, కృష్ణ, ఏసు, పెద్దన్న, వీరనారప్ప, అరుణోదయ కళా మండలి నాయకులు చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి హత్య



గిత్తరాజు (ఫైల్)

కుందుర్పి: మండలంలోని వడ్డెపాళ్యం గ్రామానికి చెందిన గిత్తరాజు (28) హత్యకు గురయ్యాడు. జిల్లా సరిహద్దున కర్ణాటక పరిధిలోని శీగలపల్లి క్రాస్ వద్ద గురువారం రాత్రి ఆయనను దుండగులు హతమార్చారు. కాగా, కుందుర్పి మండలం మలయనూరు గ్రామానికి చెందిన ఓ యువతితో గిత్తరాజు వివాహేతర సంబంధం నెరపేవాడు. ఈ క్రమంలో యువతి తరపు కుటుంబసభ్యులు ఎంత నచ్చచెప్పినా వినకపోవడంతో వారే పథకం ప్రకారం గిత్తరాజును హతమార్చినట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కర్ణాటకలోని పరుశురాంపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా పరుశురాంపురంలో ఒకరిని, మలయనూరులో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. కాగా, హతుడు గిత్తరాజుకు భార్య ఈశ్వరమ్మ, ఆరు నెలల వయసున్న చిన్నారి ఉన్నారు.

సాగునీటిపై పెత్తనం ఎవరిది?

• నేడు హెచ్చెల్సీ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ ఎంపిక
• అనంతపురం, వైఎస్సార్ జిల్లా కమిటీ ఛైర్మన్ల మధ్య పోటీ

అనంతపురం సెంట్రల్: సాగునీటి సంఘాల ఎన్నికల్లో కీలకమైన ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక ప్రక్రియను అనంతపురంలోని హెచ్చెల్సీ కాలనీ సమీపంలో ఉన్న లోకలైజేషన్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. అనంతపురం, వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాలకు చెందిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు పాల్గొని ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌ను ఎన్నుకోనుండడంతో చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది.

రెండు జిల్లాల మధ్యే ప్రధాన పోటీ

సాగునీటి సంఘాల ఎన్నికల్లో కీలకమైన ఘట్టాన్ని శనివారం అధికారులు ఎదుర్కోబోతున్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఎన్నికలను ఏకపక్షంగా జరుపుకోవడంతో ఇప్పటి వరకూ కూటమి పార్టీ విజయం సాధించింది. అన్ని డిస్ట్రిబ్యూటరీ కమిటీలు అధికార పక్ష మద్దతుదారుల వశమయ్యాయి. ఈ క్రమంలో ముఖ్యమైన ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవిని దక్కించుకునే అంశంలో అనంతపురం, వైఎస్సార్ జిల్లా చైర్మన్‌లు జోరుగా పావులు కదుపుతున్నారు.

అనంతపురం జిల్లా పరిధిలో ఐదు, కర్నూలు జిల్లాలో ఒకటి, వైఎస్సార్ జిల్లాలో ఆరుగురు చొప్పున డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు ఉన్నారు. నీటి కేటాయింపుల్లో, నామినేషన్ పనులు చేపట్టడంలో చైర్మన్‌కు కొన్ని అధికారులుంటాయి. రూ. 5 లక్షల లోపు పనులు మంజూరు చేసే అధికారం కూడా చైర్మన్ చేతుల్లోనే ఉంటుంది. దీంతో చైర్మన్ గిరి దక్కించుకోవడానికి రెండు జిల్లా ప్రజాప్రతినిధులు రంగంలో దిగారు. ఇప్పటి వరకూ ఎక్కువ శాతం వైఎస్సార్ జిల్లా వారే చైర్మన్‌గా ఉంటూ వచ్చారు. ఈ సారి ఎలాగైనా అనంతపురానికి అవకాశం దక్కేలా చూడాలని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఫోర్జరీ సంతకాలతో రేషన్ బియ్యం పక్కదారి!

ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గంలో పెద్దఎత్తున పట్టుబడిన రేషన్ బియ్యం కేసులో అక్రమార్కులకు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అండగా నిలిచారు. ఇందుకు గాను డీటీ, పోలీస్ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి బియ్యాన్ని పక్కదారి పట్టించిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు...ఈ ఏడాది అక్టోబర్ 8న ఉరవకొండ శివారులోని రాములమ్మ ఆలయం వద్ద ఐచర్ వాహనం, ఆటోల్లో రేషన్ బియ్యాన్ని లోడ్ చేస్తున్నట్లుగా సమాచారం అందుకున్న అప్పటి సీఐ సురేష్‌బాబు, పోలీసులు అక్కడకు చేరుకుని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. 140 బస్తాల్లో 68 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. అనంతరం పీఎస్‌లో అంతా తానై దుప్పటి పంచాయితీలకు తెరలేపే ఓ కానిస్టేబుల్ ఈ అంశంలో జోక్యం చేసుకుని అధికారులకు తెలియకుండా డిప్యూటీ తహసీల్దార్, అప్పటి సీఐ సంతకాన్ని ఫోర్జరీ చేసి 68 క్వింటాళ్ల బియ్యంలో కేవలం 30 క్వింటాళ్లను మాత్రమే స్వాధీనం చేసుకున్నట్లు రికార్డులు చూపించాడు. మిగిలిన 38 క్వింటాళ్ల బియ్యాన్ని పక్కదారి పట్టించాడు. ఈ వ్యవహారంలో ఓ వీఆర్వో ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఫోర్జరీ వ్యవహారం రెండు రోజుల క్రితం వెలుగుచూడడంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు గుట్టు చప్పుడు కాకుండా విచారణ చేపట్టారు. దీనిపై తహసీల్దార్ మహబూబ్‌బాషాను వివరణ కోరగా ఫోర్జరీ సంతకాలతో బియ్యాన్ని పక్కదారి పట్టించిన వైనం వాస్తవమేనని నిర్ధారించారు. దీనిపై విచారణ జరిపించి నివేదికను జాయింట్ కలెక్టర్‌కు పంపనున్నట్లు పేర్కొన్నారు.

ప్రేమికుల ఆత్మహత్య

పావగడ: జీవితంపై విరక్తితో ప్రేమికులు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు... కుందుర్పి మండలం వెంకటమ్మనపల్లికి చెందిన గోవిందరెడ్డి, లక్ష్మీదేవి (బధిరురాలు) బతుకు తెరువు కోసం కొన్నేళ్లుగా బెంగళూరులోనే స్థిరపడ్డారు. ఈ క్రమంలో అక్కడ పరిచయమైన జ్యోతి(30)తో గోవిందరెడ్డి (35) వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వచ్చాడు. గురువారం పావగడకు వచ్చిన వారు రాత్రి స్థానిక ఓ హోటల్‌లో బస చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు చెళ్లకెరె క్రాస్ వద్దకు చేరుకుని బయలు ప్రదేశంలో మద్యంలో విషపూరిత ద్రావకం కలుపుకుని తాగారు. అటుగా వెళ్లిన వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పావగడ పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. జ్యోతి మరణించినట్లు నిర్ధారించుకున్నారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న గోవిందరెడ్డిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఉదయం 11 గంటలకు గోవిందరెడ్డి మృతి చెందాడు. జ్యోతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సురేష్ తెలిపారు.

మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శిగా విజయ్‌కుమార్



గుంతకల్లుటౌన్: దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్ నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సికింద్రాబాద్‌లో జోనల్ కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన మజ్దూర్ యూనియన్ 7వ త్రైవార్షిక జనరల్ కౌన్సిల్ సమావేశంలో జోన్ పరిధిలోని వివిధ డివిజన్ల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, అధ్యక్షుడిగా రేణిగుంటకు చెందిన లోకోపైలట్ బీఎం బాషా, అదనపు సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులు, జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా సురేష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

వ్యక్తి దుర్మరణం



మృతుడు తిమ్మప్ప

బెళుగుప్ప: ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం శ్రీరంగాపురం గ్రామానికి చెందిన తిమ్మప్ప (51) వ్యక్తిగత పనిపై శుక్రవారం బెళుగుప్పకు వచ్చాడు. పని ముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. నక్కలపల్లి గేట్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వరి గడ్డి లోడుతో వేగంగా దూసుకొచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన తిమ్మప్ప తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య కళావతి, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.

ఇక్కడ ఉండలేను నాన్నా..

కటిక పేదరికంతో కష్టాలు పడుతున్న ఓ కుటుంబాన్ని విధి వెక్కిరించింది. పిల్లాడికి ఒక్క పూట తిండి పెట్టలేని స్థితిలో పనిలోకి పంపిన తల్లిదండ్రులకు చివరకు గర్భశోకమే మిగిలింది. బరువైన పనులు చేయలేక సతమతమైన చిన్నారి పట్టుమని 14 ఏళ్లు కూడా నిండకనే ఉరికి విగతజీవిగా వేలాడాడు. విషాదకరమైన ఈ ఘటన అనంతపురం కలెక్టరేట్‌కు కిలోమీటరు దూరంలోనే చోటు చేసుకోవడం గమనార్హం.

• చిరుప్రాయంలోనే భవన నిర్మాణ కార్మికుడిగా మారిన బాలుడు
• బతుకు తెరువు కోసం అనంతకు వలస
• బరువైన పనులు చేయలేకపోతున్నానంటూ తల్లిదండ్రుల వద్ద ఆవేదన
• సొంతూరికే వస్తానని... పొలం పనులు చేస్తానంటూ వేడుకోలు
• స్పందించని కుటుంబసభ్యులు
• మనస్తాపంతో ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న శివ

అనంతపురం: భవన నిర్మాణ రంగంలో బరువైన పనులు చేయలేక ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా ఆదోని మండలం పెద్ద తుంబలం గ్రామానికి చెందిన కురబ అయ్యన్నకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కటిక పేదరికం కారణంగా పిల్లలను పోషించుకోలేక ఇబ్బంది పడేవారు. ఈ క్రమంలో చిరుప్రాయంలోనే పిల్లలు కార్మికులుగా మారారు. ఆరో తరగతితోనే చిన్న కుమారుడు శివ (14) కూడా చదువులకు స్వస్తి పలికి తన అన్న నాగేంద్రతో పాటు సెంట్రింగ్ పనుల్లో పాలుపంచుకోసాగాడు.

బతుకు తెరువుకు వలస వచ్చి...

బతుకు తెరువులో భాగంగా శివ, నాగేంద్ర, రమేష్, సురేష్, వలి ఆరు నెలల క్రితం అనంతపురానికి వలస వచ్చి భవన నిర్మాణ పనుల్లో పాలుపంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో హౌసింగ్ బోర్డులోని హమాలీ కాలనీలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వేకువజామునే పనిలోకి వెళ్లి సాయంత్రం ఆరు గంటల తర్వాత గదికి చేరుకునేవారు. విపరీతమైన పని ఒత్తిడితో పాటు పని ప్రాంతంలో బరువైన పనులు చేయలేక శివ ఇబ్బంది పడ్డాడు. ఇదే విషయాన్ని తన తల్లిదండ్రులకు పలుమార్లు తెలిపాడు. అనంతపురంలో ఉండడం తనకు ఇష్టం లేదని, ఊరికి వచ్చేస్తానని, తనను పిలుచుకెళ్లాలని పలుమార్లు ప్రాధేయపడ్డాడు. అక్కడ వ్యవసాయ కూలి పనులకు వెళ్తానంటూ వేడుకున్నాడు. అయినా తల్లిదండ్రులు వినలేదు. దీంతో మనస్తాపం చెందిన శివ... శుక్రవారం మధ్యాహ్నం గదికి వెళుతున్నట్లు తన అన్న నాగేంద్రకు తెలిపి పని ప్రాంతం నుంచి ఒక్కడే గదికి చేరుకుని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న అనంతపురం రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాలుడి తండ్రి అయ్యన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీకాంత్‌యాదవ్ తెలిపారు.

క్లుప్తంగా

సన్మానం



రిటైర్డ్ హెచ్ఎం వేణుగోపాలకృష్ణను సన్మానిస్తున్న డీఈఓ ప్రసాద్ బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: గార్లదిన్నె మండలం ఇల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ గత నెలలో ఉద్యోగ విరమణ చేసిన కె.వేణుగోపాలకృష్ణ పరీక్షల విభాగానికి చేసిన సేవలకు గుర్తింపుగా సన్మానించారు. శుక్రవారం పాత డీఈఓ కార్యాలయంలోని పరీక్షల విభాగంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈఓ ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ చేతుల మీదుగా వేణుగోపాలకృష్ణను సన్మానించారు. ఆయన చేసిన సేవలను గోవిందునాయక్ కొనియాడారు.

బకాయి వసూళ్లపై అసంతృప్తి



డీసీ వెంకటేశ్వర్లుతో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: కొత్తూరు, పాతూరు నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్ గదుల బకాయిలు వంద శాతం వసూలు చేయాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో డీసీ వెంకటేశ్వర్లు, రెవెన్యూ అధికారులతో సమావేశం అయ్యారు. బకాయిల జాప్యంపై మేయర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లలో దీర్ఘకాలికంగా అద్దె చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. షాప్‌లు సీజ్ చేసినట్లు డీసీ వెంకటేశ్వర్లు మేయర్‌కు వివరించారు. షాప్ సీజ్ చేసినా.. డబ్బు వసూలు చేయాలన్నారు. అవసరమైతే చట్ట ప్రకారం ముందుకెళ్లాలన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లలో ప్రతి నెల అద్దె వసూలు చేయాలన్నారు. అదేవిధంగా ఇంటి, నీటి పన్నును వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్ఓలు విజయ్ కుమార్, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రేపు శారదా దేవి జయంతి

అనంతపురం కల్చరల్: హెచ్చెల్సీ కెనాల్ వద్ద ఉన్న శ్రీరామకృష్ణ సేవా సమితి ప్రాంగణంలో ఈనెల 22వ తేదీన శారదాదేవి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు శ్రీరామకృష్ణ సేవా సమితి ప్రధాన కార్యదర్శి గుత్తి శ్రీధరమూర్తి, ప్రవీణ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, సామూహిక భజనలు, వేదపఠనం అనంతరం శ్రీశారదా మాత చరితామృత పఠనంతో పాటూ సంగీత విద్వాంసురాలు సంధ్యామూర్తి శిష్యబృందాలతో భక్తిగీతాలాపన ఉంటుందని పేర్కొన్నారు. భక్తులందరూ పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

విజేత ఎస్ఎస్‌బీఎన్ జట్టు



క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

అనంతపురం: ఎస్వీ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్కేయూ అంతర కళాశాల క్రికెట్ టోర్నమెంట్ విజేతగా ఎస్ఎస్‌బీఎన్ జట్టు నిలిచింది. శుక్రవారం ఆర్డీటీ క్రీడా మైదానంలో ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల, కదిరి బ్లూమూన్ డిగ్రీ కళాశాల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల జట్టు 25 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 259 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.అనంతరం బ్యాటింగ్ చేసిన కదిరి బ్లూమూన్ డిగ్రీ కళాశాల జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 169 పరుగులకే పరిమితమైంది. ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల 90 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వరుసగా 18 దఫాలు వర్సిటీ క్రికెట్ టోర్నీ విజేతగా ఎస్ఎస్‌బీఎన్ జట్టు రికార్డు సృష్టించింది. విజేతలకు ఎస్వీ డిగ్రీ కళాశాల చైర్మన్ డాక్టర్ సి.సోమశేఖర్ రెడ్డి, కళాశాల వైస్ చైర్మెన్ సి.చక్రధర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎం.శ్రీనివాసులు నాయక్ ట్రోఫీ అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అనంతపురం సిటీ: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొత్తగా ఎన్నికైన కె.హనుమంతు, అసోసియేట్ అధ్యక్షుడు సాకే రామాంజనేయులు ప్రకటించారు. అనంతపురంలోని ఆ శాఖ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిద్దరినీ సంఘం ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగులకు సంబంధించి సమస్యలు ఉన్నాయని తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీజేపీ సభ్యులు నాగరాజు, ఈశ్వరయ్య, సుధాకర్, నాగార్జున, మౌలా, వినోద్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుప్పలు.. ముప్పతిప్పలు

- 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలు
- అస్తవ్యస్తంగా చెత్త నిర్వహణ
- దుర్వాసన వెదజల్లుతున్న రహదారి
- పట్టించుకోని పంచాయతీ సిబ్బంది



చెన్నేకొత్తపల్లి వద్ద జాతీయ రహదారి పక్కన వేసిన చెత్తాచెదారం

చెన్నేకొత్తపల్లి: పారిశుధ్య నిర్వహణ చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రానికి సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు, తడి, పొడి చెత్తను పడేస్తున్నారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేస్తుండటంతో రోడ్డు వెంబడి చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. రోజూ ఈ రహదారిపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చెన్నేకొత్తపల్లి నుంచి పెనుకొండకు వెళ్లే జాతీయ రహదారి దుర్వాసన వస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జాతీయ రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు కూడా విపరీతంగా పెరిగాయి. చికన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలను తీసుకొచ్చి ఈ పిచ్చి మొక్కల మధ్య పారబోస్తున్నారు. చెత్తా చెదారంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు కుళ్లిపోవడంతో ఈ ప్రాంతం దుర్గంధం వెదజల్లుతోంది. అటుగా వెళ్లే ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చికన్ సెంటర్ నిర్వాహకులు పడేసే వ్యర్థాలను తినేందుకు కుక్కలు, పందులు వస్తున్నాయి. రోడ్డు దాటే క్రమంలో మృత్యువాత పడుతున్నాయి. ఇక మృతి చెందిక కుక్కలు, పందుల కళేబరాలను జాతీయ రహదారి పక్కన పడివేయడంతో కుళ్లిపోతున్నాయి. ప్రజలు చెత్తను ఇష్టానుసారంగా పడేస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవడంతో అధికారులు విఫలమవుతున్నారు. తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చికెన్ వ్యర్థాలు, చెత్తను జాతీయ రహదారి పక్కన వేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్వాసన వస్తోంది..

జాతీయ రహదారిపైకి వెళ్లగానే దుర్వాసన వెదజల్లుతోంది. చికెన్ సెంటర్ నిర్వాహకులు రోడ్డు పక్కనే వ్యర్థాలను పడేస్తున్నారు. వ్యర్థాలు కుళ్లిపోవడంతో వాసన వస్తోంది. సరదాగా వాకింగ్‌కు కూడా వెళ్లలేకపోతున్నాం. పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– వెంకటేష్, చెన్నేకొత్తపల్లి

చర్యలు తీసుకుంటాం

ఈ ప్రాంతంలో చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకుంటాం. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. చెత్తను సంపద కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా చెత్తను బయట వేయకూడదు. చెత్తను తరలించే వాహనాలకు అందించాలి. జాతీయ రహదారి పక్కను వ్యర్థాలను తొలగించి, సమస్యను పరిష్కరిస్తాం.

– నారాయణ స్వామి, పంచాయతీ కార్యదర్శి, చెన్నేకొత్తపల్లి

మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు



మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: పుట్టుకతో వివిధ రకాల సమస్యలతో జన్మించిన పిల్లలకు డీఈఐసీ ఆధ్వర్యంలో మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ సర్వజనాస్పత్రి డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. శుక్రవారం సర్వజనాస్పత్రిలోని డీఈఐసీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, హైదరాబాద్ ఏవీఆర్ ఆస్పత్రి నిర్వాహకులతో పుట్టుకతో గ్రహణం మొర్రి, పెదవి చీలకతో బాధపడుతున్న చిన్నారులకు స్క్రీనింగ్ నిర్వహించారు. ఓరల్ మాక్సిలల్లో ఫేషియల్ సర్జన్ (ఓఎంఎఫ్ సర్జన్) డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ యశస్విని తదితరులు పిల్లలకు స్క్రీనింగ్ చేశారు. కొందరిని హైదరాబాద్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 182 మందికి శస్త్రచికిత్స చేయించి తదుపరి అవసరమైన స్పీచ్ థెరపీ ద్వారా పిల్లలు సాధారణ స్థితికి తెచ్చేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ రాజేష్, డీఈఐసీ వైద్యురాలు డాక్టర్ శ్రీవిద్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్, డెంటల్ డాక్టర్ ముత్యాలమ్మ, సిబ్బంది రాజేశ్వరి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న జన్మదిన వేడుకలు

రాప్తాడు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకుందామని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్దకు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఎంపీపీ హేమలత, కన్వీనర్ లక్ష్మీనరసింహ, యూత్ కన్వీనర్ కొండారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనతో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉదయం 9 గంటలకు వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకోవాలని కోరారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం



ప్రార్థనలు చేస్తున్న పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు

రాప్తాడు రూరల్: ఏసు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు పిలుపునిచ్చారు. అనంతపురం రూరల్ నందమూరి నగర్ కల్వరి రివైవల్ చర్చ్‌లో శుక్రవారం ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సంఘ కాపరి జహంగీర్ జాషువా అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు నెహెమ్యా రెడ్డివారి నాగరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన పాపములకు ప్రాయశ్చిత్తమై ఉండేందుకు దేవుడు తన కుమారుడిని పంపారన్నారు. ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమన్నారు. క్రిస్మస్ పండుగతో ప్రతి ఇంటా శాంతి, సౌభాగ్యాలు నెలకొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాస్టర్ రూఫస్ కుమార్, పాస్టర్ లాబాను సుధాకర్, పాస్టర్ సుధాకర్ రెడ్డి, పాస్టర్ మల్లికార్జున పాల్, కల్వరి రివైవల్ ప్రార్థన మందిర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప చక్రస్నానం

అనంతపురం కల్చరల్: గత పది రోజులుగా హరిహరసుతుడికి జరుగుతున్న పూజలు ముగింపు దశకు చేరుకున్నాయి. శుక్రవారం మొదటి రోడ్డు హరిహర సుత అయ్యప్ప స్వామికి చక్రస్నాన వేడుకలు నిర్వహించారు. కో–ఆప్షన్ మెంబర్ లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మాలధారులు వెంటరాగా మొదటి రోడ్డు శివాలయ ప్రాంగణం నుంచి హెచ్చెల్సీ కెనాల్ వరకు అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లారు. అక్కడ కేరళ పద్ధతుల్లో చక్రస్నానం చేయించారు. వేదమంత్రాలు, సామూహిక భక్తిగీతాలతో సందడిగా సాగిన వేడుకల్లో గురుస్వాములు శ్రీనివాసులు, ఆంజనేయులు, వెంకటనారాయణ, చలపతి, మహేష్, రాజశేఖరరెడ్డి, ఫణి తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు చేసి, సామూహిక భిక్ష చేశారు.

రైతులను ముంచుతున్న పాలకుల విధానాలు

అనంతపురం సిటీ: వ్యవసాయ రంగంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు రైతులను ముంచేలా ఉన్నాయని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెస్తున్న నల్లచట్టాల ప్రభావం రాయలసీమ రైతాంగంపై తీవ్ర దుష్ప్రరిణామాలు చూపే ప్రమాదముందని హెచ్చరించారు. అనంతపురం జిల్లా పరిషత్ క్యాంపస్‌లోని డీపీఆర్‌సీ భవన్‌లో శుక్రవారం సాయంత్రం సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ రాసిన మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. మానవ హక్కుల వేదిక నాయకుడు ఎస్ఎం బాషా అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'రైతును ముంచుతున్న పాలకుల విధానాలు' పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ఆవిష్కరించారు. 'విద్వేష రాజకీయాలు' పుస్తకాన్ని ప్రొఫెసర్ ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, 'అసమానతలు–ఆర్థిక విధానాలు' పుస్తకాన్ని సత్యబోస్ ఆవిష్కరించారు. ప్రశ్నించడమే నేరమైపోతున్న రాజకీయ వ్యవస్థలో నిజాన్ని నిర్భయంగా చెప్పడమే పెద్ద సాహసమైపోయిందని రాచపాలెం అన్నారు. ఎన్నికల సమయంలో అసాధారణమైన, ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి, అధికారంలోకి రాగానే ఓట్లేసిన ప్రజల్ని అణచివేయడం పాలకులకు అలవాటుగా మారిపోయిందని మండిపడ్డారు. మార్పు రావడమంటే పార్టీలు, ప్రభుత్వాలు మారడం కాదని, తన రచనల ద్వారా బలమైన ప్రత్యామ్నాయ అవసరాన్ని చాటిచెప్పారని పేర్కొన్నారు. నీటి కోసం ఎదురు చూస్తున్న జనం ఒకవైపు.. పాలకుల నిర్లక్ష్యంతో వందల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలసిపోతున్న తీరు మరోవైపు ఉందని గేయానంద్ అన్నారు. గిట్టుబాటు ధరలు అందని రైతాంగం అప్పుల్లో కూరుకుపోతుంటే దళారులు సంపన్నులవుతున్న తీరును రాంభూపాల్ తన రచనల్లో కళ్లకు కట్టినట్లు వివరించారని ప్రశంసించారు. దేశంలో పెరిగిపోతున్న ఆర్థిక అసమానతలు అత్యధిక శాతం ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్నాయని ప్రముఖ బడ్జెట్ విశ్లేషకుడు సత్యబోస్ అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఓబులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్, న్యూడెమోక్రసీ నాయకుడు ఏసురత్నం, రామకృష్ణారెడ్డి, అమరనాథరెడ్డి, చంద్రశేఖర్, జయరామప్ప, షేకన్న, గోవిందరాజులు, నబీరసూల్, రమణ, రాంకుమార్, డాక్టర్ ప్రసూన, వేణుగోపాల్, వి.సావిత్రి, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

కురుబలు అన్ని రంగాల్లో ముందుండాలి



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: రాబోవు రోజుల్లో కురుబలు అన్ని రంగాలో ముందుండాలి. ప్రతి ఒక్కరూ ఐక్యతగా ముందుకెళ్లాలని కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య సూచించారు. శుక్రవారం స్థానిక కనకదాస కళ్యాణ మంటపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. జిల్లాలో కురుబలను ఒక్క తాటిపై తీసుకొచ్చేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. సంఘాన్ని బలోపేతం చేయుటకు జిల్లా కమిటీలోకి చురుకుగా ఉన్న వారిని తీసుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగా కళ్యాణదుర్గం తిమ్మసముద్రం గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసులును జిల్లా కమిటీలోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆయన్ను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించామన్నారు. కార్యక్రమంలో బోరంపల్లి ఆంజనేయులు, ఆవుల కృష్ణయ్య, బ్యాల్ల నాగేంద్ర, విఠల్ గౌడ్, నరేష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

నాన్ బోర్డర్లపై కఠిన చర్యలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ హాస్టళ్లలో ఉంటున్న నాన్ బోర్డర్లు వెంటనే హాస్టళ్లను ఖాళీ చేసి వెళ్లిపోవాలని రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఎస్కేయూ పరిసరాల్లోని హోటళ్లు, గ్యారేజీల్లో పని చేస్తూ హాస్టళ్లలో బస చేస్తూ ఉన్నారన్నారు. దీంతో పీజీ చదువుతున్న విద్యార్థులకు వసతి లేక ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. 24 గంటల్లో నాన్ బోర్డర్లు హాస్టళ్లను వదిలి వెళ్లకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

ప్రాక్టీస్‌లో బిజీ బిజీ..



బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న దృశ్యం

అనంతపురం: బీసీసీఐ కూచ్ బెహర్ అండర్–19 ట్రోఫీలో భాగంగా నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో ఈనెల 22 నుంచి 25 వరకు క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో పాల్గొనేందుకు ఆంధ్ర, మహారాష్ట్ర జట్టు క్రీడాకారులు అనంతపురానికి చేరుకున్నారు. శుక్రవారం ఆర్డీటీ స్టేడియంలో బ్యాటింగ్, ఫీల్డింగ్ ప్రాక్టీస్ చేశారు. ఆంధ్ర జట్టు హెడ్ కోచ్ ఏజీ ప్రదీప్, మహారాష్ట్ర హెడ్ కోచ్ అజయ్ చవాన్ క్రికెటర్లకు పలు సూచనలు ఇచ్చారు.

23న హుండీ కానుకల లెక్కింపు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 23వ తేదీన హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే భక్తులు సాంప్రదాయ దుస్తుల్లో రావాలని సూచించారు.

'అంబేడ్కర్‌ను అవమానిస్తే ఊరుకోం'

అనంతపురం టవర్‌క్లాక్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తే ఊరుకునేది లేదని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాకేహరి మాట్లాడుతూ.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. తక్షణమే దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కోరారు. అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు గోపాల కృష్ణ, బాలరాజు, రామకృష్ణ, ఆదెప్ప, నాగేంద్ర, ఈశ్వరయ్య, వెంకటేష్, కుళ్లాయప్ప, నరేష్, లక్ష్మయ్య, బాబు పాల్గొన్నారు.

'అర్హత లేని ప్రొఫెసర్లపై చర్యలు తీసుకోండి'

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో అనర్హులైన ప్రొఫెసర్లపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. శుక్రవారం జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని ప్రిన్సిపాల్ కార్యాలయం ముందు ఏబీవీపీ నాయకులు బైఠాయించారు. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కెమికల్ విభాగంలో ఇద్దరు విద్యార్థులను పరీక్షలకు అనుమతించాలని కోరినప్పటికీ.. ఉన్నతాధికారులు స్పందించలేదు. ఇద్దరు విద్యార్థులను మాత్రం పరీక్షలకు అనుమతించక పోవడంతో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. అందరికీ న్యాయం చేయాలని కోరారు. ప్రిన్సిపాల్ కార్యాలయంలోకి ఎవరినీ వెళ్లనీయకుడా అడ్డుకుంటామని ఏబీవీపీ నాయకులు స్పష్టం చేశారు. ఆందోళన చేపడుతున్న ఏబీవీపీ నాయకులను నచ్చచెప్పడానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి ప్రయత్నించారు. అయినప్పటికీ ఆందోళనలు కొనసాగించారు. దీంతో వన్‌టౌన్ సీఐ వి.రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్ఐ డి.శ్రీనివాసులు ఆందోళన చేస్తున్న విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. ఏబీవీపీ ఉమ్మడి అనంతపురం జిల్లా కన్వీనర్ అఖిల్ కుమార్ రెడ్డి, జేఎన్‌టీయూ అనంతపురం అధ్యక్షుడు భరత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దివాకర్ నాయక్, బాబు, విజయ్, భూతరాజు, నితిన్, యశ్వంత్, విజయ్ తదితరులను వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కి తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి కింది వరకు పోలీసులు మెట్లమీద ఈడ్చుకుంటూ అరెస్ట్ చేసి అవమానానికి గురి చేశారన్నారు. సమస్యలను పరిష్కరించమంటే పోలీసులతో దాడులు చేయిస్తున్న జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జి వీసీ, ప్రిన్సిపాల్, రిజిస్ట్రార్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి నాయకులు అనే కనీసం స్పృహ లేకుండా పోలీసులు ప్రవర్తించారంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

శకుంతలమ్మ మృతి తీరనిలోటు



మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: గత 40 సంవత్సరాలుగా ప్రజల కోసం అలుపెరగని పోరాటాలు చేసిన శకుంతలమ్మ మృతి మహిళ రంగానికి తీరనిలోటని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శకుంతలమ్మ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శకుంతలమ్మ నిజాయతీగా పార్టీలో పని చేశారన్నారు. ఆమె సేవలు మరువరానివని కొనియాడారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, కార్మికులకు కనీస వేతనం అమలుకు పోరాటం చేశారని తెలిపారు. కార్మిక, మహిళల సమస్యలపై ఉద్యమాలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, అనంతపురం జిల్లా కార్యదర్శి జాఫర్, సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య, నాయకులు నారాయణ స్వామి, మల్లికార్జున, కేశవ రెడ్డి, రామకృష్ణ, వీరభద్ర స్వామి, రాజారెడ్డి, పద్మావతమ్మ, రమణ, రాకేష్ గౌడు, కుళ్లాయి స్వామి, సంతోష్, కృష్ణుడు, చిరంజీవి, కమరబేగం, కేవీ రమణ, రామాంజనేయులు, చెన్నప్ప, పార్వతీ, అల్లీపీరా, పోతలయ్య, హనుమంతు, గోవిందు, నాగమణి, శ్రీనివాసులు, కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గాడ్గే బాబా స్ఫూర్తితో పని చేయాలి



గాడ్గేబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చేతివృత్తిదారుల సమాఖ్య నాయకులు

అనంతపురం అర్బన్: పేదల సమస్యల పరిష్కారానికి పోరాటం చేసిన గాడ్గే బాబాను స్ఫూర్తిగా తీసుకుని పని చేయాలని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక చాకలి ఐలమ్మ కాలనీలో గాడ్గే బాబా వర్ధంతి నిర్వహించారు. గాడ్గే బాబా చిత్రపటానికి చేతివృత్తిదారుల సమాఖ్య నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగమయ్య మట్లాడుతూ.. గాడ్గే బాబా మహరాష్ట్రలో జన్మించారన్నారు. సమాజం బాగు కోసం నిరంతరం శ్రమించారని కొనియాడారు. ముఖ్యంగా పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ నుంచి ప్రశంసలు పొందినట్లు గుర్తు చేశారు. గాడ్గే బాబా జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షురాలు ఈశ్వరమ్మ, జిల్లా కార్యదర్శి హరికృష్ణ, ఉపాధ్యక్షుడు నాగప్ప, నాయకులు నాగరాజు, సంజీవులు, లక్ష్మీనారాయణ, వీరాంజి, లక్ష్మీదేవి, వీరనారాయణప్ప, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనం చెల్లించాలి

అనంతపురం కార్పొరేషన్: గత నెలలో ధర్నాలో భాగంగా మూడు రోజుల పాటు విధులకు దూరంగా ఉన్న 250 మంది కార్మికులకు రానున్న జీతంలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ సంఘం నాయకులు శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ రామలింగేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇందుకు కమిషనర్ ససేమీరా అన్నారు. విధులకు గైర్హాజరైతే ఏ విధంగా వేతనం ఇవ్వాలో చెప్పాలన్నారు. పనిముట్లు లేకపోవడంతో తాము విధులకు రాలేదని కార్మికులు తెలిపారు. పాలకవర్గం, ఉన్నతాధికారులతో చర్చించి వేతనం మంజూరుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ రామలింగేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యా బోధన భేష్..



పిల్లలతో ఆటలు ఆడిస్తున్న రాష్ట్ర ప్రథమ్ బృందం

ఆత్మకూరు: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ప్రథమ్ బృందం నుంచి రాష్ట్ర ఎంఎంఈ వెంకట్, జిల్లా సమన్వయ కర్త రామ్మోహన్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఎలాంటి ఆహారం అందిస్తున్నారు? ఆటల ద్వారా ఏ విధంగా విద్యను బోధిస్తున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో కొద్దిసేపు ముచ్చటించారు. పిల్లల నుంచి వచ్చే మంచి అలవాట్లు, ఆట, పాట, మాట, కథ, సృజనాత్మకత, సంసిద్ధత, విధానాలను మెచ్చుకున్నారు. ఇలా ఆటల ద్వారా చిన్నారులకు విద్యను బోధించడం ద్వారా త్వరగా నేర్చుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కార్యకర్తలకు మంచిగా గైడ్ చేస్తున్నారని మెచ్చుకున్నారు.

ముగిసిన పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్



ట్రోఫీ అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం: నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ముగిసింది. అతిథిగా హాజరైన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా చూడాలన్నారు. క్రీడా స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడాకారులకు చేయూత ఇస్తామని పేర్కొన్నారు. బాలికల విభాగంలో ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.జయచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.